RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 360 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 4-11- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥


VOLUME: 18 | ISSUE : 360 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 4-11-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా.. విజయం కూటమిదే: పవన్ కల్యాణ్



అమరావతి, సిటిజన్ టైమ్స్

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. "నగర పాలక, పుర పాలక, నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు దక్కిన అఖండ విజయాలు మా ప్రభుత్వ పాలనకు మద్దతుగా భావిస్తున్నాం. ఇది ఎంతో అమూల్యమైన తీర్పు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల పట్టణ ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఈవీఎంలను నిందించింది. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా చేపట్టిన స్థానిక ఎన్నికలలోనూ ప్రజలు అదే స్థాయి విజయం కూటమికి తరువాయి 2లో..



మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం

వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం

పులివెందులలో టీడీపీ చారిత్రక గెలుపు

విశాఖ, విజయవాడ సహా 10కి పైగా కార్పొరేషన్లు ఎన్డీయే కైవసం

ఒక్క నందికొట్కూరు మున్సిపాలిటీకే పరిమితమైన వైసీపీ

ఇది ప్రజా విజయమన్న చంద్రబాబు,

ఎన్నిక కాదు ఎంపిక అని ఆరోపించిన జగన్

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి పురపాలక ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించింది. దాదాపు అన్ని పట్టణ స్థానిక సంస్థలను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసింది. మంగళవారం రాత్రి వెలువడిన ఫలితాలు, ఓట్ల లెక్కింపు సరళిని బట్టి తెలుగుదేశం పార్టీ (టీడీపీ), దాని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ దాదాపు అన్ని చోట్లా విజయ దుందుభి మోగించాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 138 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఫలితాలు వెలువడుతున్న కొద్దీ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు తరువాయి 2లో..

24 గంటలు దాటింది మోదీ జీ.. చర్చకు వస్తున్నారా?: రాహుల్ గాంధీ



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

విదేశీ శక్తులతో సంబంధాల అంశంపై తనతో బహిరంగ చర్చకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన తాజాగా 'ఎక్స్' వేదికగా మరో పోస్టు పెట్టారు. తాను సవాల్ విసిరి 24 గంటలు దాటిందన్నారు. వీలైనంత త్వరగా బహిరంగ చర్చకు రావాలని.. భయపడొద్దని వ్యాఖ్యానించారు. కావాలంటే.. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను మధ్యవర్తిగా పెట్టుకోవచ్చన్నారు. "ప్రతిపక్షాన్ని దేశద్రోహి అని అన్నారు కదా. దీనిపై చర్చకు ఎక్కడికైనా వస్తాను. అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? లాంటి విషయాలన్నీ తేలిపోతాయి. ఆర్థిక అంశాలు, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది? ఎందుకు తరువాయి 2లో..

ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం

పురపాలిక తీర్పుపై నారా లోకేశ్



అమరావతి, సిటిజన్ టైమ్స్

పురపాలిక ఎన్నికల ఫలితాలు సంబరాలు చేసుకోవడానికి కాదని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు లభించిన అవకాశమని రాష్ట్ర మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ లో కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న నేపథ్యంలో, ప్రజా తీర్పును తమ ప్రభుత్వం ఎంతో వినయంతో స్వీకరిస్తోందని, ఈ గెలుపు పట్ల తాము పొంగిపోవడంలేదని ఆయన పేర్కొన్నారు. పురపాలిక ఎన్నికల ఫలితాల తరువాయి 2లో..

విశాఖ మేయర్ పీఠం టీడీపీ కూటమి కైవసం..

వరుడు కల్యాణిపై భారీ ఆధిక్యంతో ముక్కా శ్రావణి విజయం



వైసీపీ అభ్యర్థి వరుడు కల్యాణిపై 44 వేలకు పైగా ఓట్ల ఆధిక్యం

ఏలూరు కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్న

జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు

విశాఖ టీడీపీకి కంచుకోట అని నిరూపించామన్న ముక్కా శ్రావణి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయ దుందుభి మోగించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నం మేయర్ పీఠాన్ని టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణి తరువాయి 2లో..

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.. ఢిల్లీకి పాక్ పొగ సెగ



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

పండుగల సీజన్ సమీపిస్తుండగా, దేశ రాజధాని ఢిల్లీని మరోసారి వాయు కాలుష్యం కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ 300 మార్కును దాటడంతో 'వెరీ పూర్' కేటగిరీకి తరువాయి 2లో..

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం

స్థానిక ఎన్నికల ఫలితాలపై స్పందించిన సీఎం చంద్రబాబు

సుపరిపాలనను చూసే ప్రజలు కూటమికి ఓటేశారని వెల్లడి

ప్రజలు మెచ్చే పాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ

అమరావతి, పోలవరం పనులను

వేగవంతం చేశామని వివరణ తరువాయి 2లో..

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన

వైసీపీ అధినేత జగన్

చంద్రబాబు, పోలీసులు,

ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం

నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను

హైజాక్ చేశారని విమర్శ



అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు తరువాయి 2లో..

CHANGE OF NAME

I, LINGIREDDY NIRANJAN REDDY
S/O, LINGIREDDY
PEDDA ESWAR REDDY,
R/O,house.no73/121, ramaraju-palli, Beside Anganvadi school,built-up, cuddapah, Andhara pradesh-516003.

I hereby declare that my father name has been recorded as L.ESWARA REDDY,instead of LINGIREDDY PEDDA ESWAR REDDY in my PNB MetLife India Insurance Policy No- 20640352, , and my father name is LINGIREDDY PEDDA ESWAR REDDY in my PAN No. AFGPL5742K,I further declare that LINGIREDDY NIRANJAN REDDY S/O LINGIREDDY PEDDA ESWAR REDDY, And LINGIREDDY NIRANJAN REDDY S/O L.ESWARA REDDY, refer to one and the same person—myself only. Henceforth, I shall be known as LINGIREDDY NIRANJAN REDDY S/O LINGIREDDY PEDDA ESWAR REDDY,for all purposes.

ఎడిటోరియల్

జగన్ రెడీ అయినట్లేనా ?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ లో దాదాపుగా ఏడేళ్ళ క్రితం నాటి స్పీడ్ ని అంతా చూశారు. ఆయన పులివెందుల ఆర్వో ఆఫీస్ ముందు నేల పైన కూర్చుని ధర్నా చేసిన తీరుని చూసినపుడు జగన్ లోకల్ ఫైట్ కి కాదు అసలు ఫైట్ కే రెడీ అయ్యారని అంటున్నారు. నిజంగా జగన్ వ్యూహం కూడా అదే. ఆయన ఆలోచనలూ చూపు అంతా 2029 ఎన్నికల మీదనే ఉన్నాయి. లోకల్ బాడీ ఎన్నికలు అయితే సాధారణంగా రిజల్ట్ ని ఎవరూ అంతగా పట్టించుకోరు. ఇక్కడ గెలుపు అన్నది అధికార పక్షానికి సహజం, సర్వ సాధారణంగానే భావిస్తారు. అధికారంలో ఉన్న పార్టీ వైపే జనాలు మొగ్గు చూపుతారు. ఇక దేశంలో ఎక్కడైనా స్థానిక ఎన్నికల్లో ఫలితాలు ఒకేలా ఉంటాయి. కాస్తా పట్టు విడుపులు ఉంటే విపక్షానికి కొన్ని సీట్లు దక్కుతాయేమో. అంతకు మించి వాటికి ఇంపార్టెన్స్ లేదనే రాజకీయ పండితులు అంటారు. మరి ఇవన్నీ జగన్ కి తెలియవా. ఎందుకు ఆయన లోకల్ బాడీస్ విషయంలో ఇంత పట్టుదల చూపించారు అంటే అక్కడే ఆయన వ్యూహం ఉందని అంటున్నారు. తాను ఒక్కడే ఆగ్రహిస్తే సరిపోదు, తనలో కసి రేగితే అది చాలదు, తన సైన్యం కూడా అలాగే ఆగ్రహించాలి. వారిలోనూ పట్టుదల పెంచాలి. అందుకే లోకల్ బాడీస్ ఎన్నికలను ఆయన ముందు పెట్టారని అంటున్నారు. ఒక విధంగా చూస్తే ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా వైసీపీ క్యాడర్ అయితే రీచార్జి అయింది. జగన్ సైతం వారి యాక్షన్ కి రియాక్షన్ అన్నట్లుగా తానూ నేల మీదకు వచ్చి నిరసనలకు సిద్ధమని చెప్పేశారు. దాంతో లోకల్ బాడీస్ కి సంబంధించి వైసీపీ ఆలోచనలు వ్యూహాలు పూర్తి అయినట్లే అంటున్నారు. ఇది కదా అసలైన ప్రశ్న. ఇపుడు ఏమిటి. వైసీపీ ఏమి చేయబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా వైరాలు ఉంటాయి. కోపాలు ఉంటాయి, కసి ఉంటుంది. అందుకే పంచాయతీలకు రాజకీయ ముద్ర లేకుండా ఎన్నికలు పెడతారు. కానీ ఇపుడు అన్ని చోట్లా అటూ ఇటూగా రాజకీయ జనం మోహరింపు కనిపిస్తోంది. అలా వైసీపీ వైపు నుంచి బాగానే మోపు చేసుకొచ్చారు అని అంటున్నారు. నేను మీకు అండగా ఉన్నాను అని జగన్ సైతం ఆందోళనలకు రెడీ అయిపోయిన వేళ అటు క్యాడర్ ఆవేశం ఇటు జగన్ వ్యూహం కలగిస్తే రేపు ఏపీలో వైసీపీ రాజకీయం ఎలా ఉండబోతోంది అన్నదే చర్చ. నెక్స్ట్ ఏంటి అన్నదే ప్రశ్న. ఇక చూస్తే జగన్ పాదయాత్రను సరిగ్గా ఎన్నికలకు ఏణ్ణర్థం ముందు మొదలెట్టడానికే చూస్తున్నారు. అంటే వచ్చే ఏడాది అక్టోబర్ కానీ నవంబర్ కానీ అది ఉండబోతోంది. అప్పటిదాకా వైసీపీ ఆవేశం అలాగే ఉంచుతార అంటే కాదనే మాట వినిపిస్తోంది. జగన్ ఈ పదకొండు నెలలూ వైసీపీని మరింతగా తట్టి లేపే కార్యక్రమాలతో పాటు తాను నిరంతరం జనంలో ఉండేలా భారీ యాక్షన్ ప్లాన్ నే రెడీ చేసుకున్నారు అని అంటున్నారు. అంటే లోకల్ ఫైట్ అన్నది వైసీపీ వ్యూహంలో ట్రైలర్ అయితే 2029 లో అసలు సినిమా అంటున్నారు. దీంతో రానున్న రోజులలో ఢీ అంటే ఢీ అన్న రాజకీయం ఏపీలో సాగుతుందని అంటున్నారు. అంతే కాదు ఏపీ మరింతగా హీటెక్కిపోవడం ఖాయమని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పురపోరులో కూటమి జైత్రయాత్ర

స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేష న్లలో మేయర్ పీఠాలను కూటమి కైవసం చేసుకోగా, మరో 5 కార్పొరేష న్లలో ఆధిక్యంలో నిలిచింది. వైసీపీ కేవలం ఒక చోట మాత్రమే ఆధిక్యం కనబరిచింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 79 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు గాను సుమారు 90% స్థానాలను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నాయి. వైసీపీ కేవలం నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే గెలిచి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆదివారం (నవంబరు 1) నాడు 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు పోలింగ్ జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకారం, మొత్తం 62.16 శాతం పోలింగ్ నమోదైంది. 96,89,061 మంది ఓటర్లకు గాను 60,22,411 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రధాన నగరాల్లోనూ కూటమి విజయకేతనం

రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్ అయిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ) మేయర్‌గా టీడీపీకి చెందిన ముక్కా శ్రావణి ఎన్నికయ్యారు. పుణ్యక్షేత్రం తిరుపతి మేయర్‌గా టీడీపీ అభ్యర్థి ఎం. శ్రీనివాస్ ప్రసాద్, గుంటూరు మేయర్‌గా కే. లక్ష్మీ అపర్ణ విజయం సాధించారు. చిత్తూరు కార్పొరేషన్ మేయర్‌గా టీడీపీకి చెందిన కే. హేమలత గెలుపొందారు. మచిలీపట్నం మేయర్‌గా షేక్ అబ్దుల్లా అబిదా (టీడీపీ), కర్నూలు మేయర్‌గా విజయ ప్రత్యూష (టీడీపీ) ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు కైవసం చేసుకున్నారు. మరో 17 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. 8 మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్‌తో పాటు వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీట్ల పంపకంలో భాగంగా 10 కార్పొరేషన్లలో టీడీపీ, రెండింట జనసేన, ఒకచోట బీజేపీ మేయర్ పదవులకు పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ కంచుకోట అయిన పులివెందులలో టీడీపీ చారిత్రక విజయం సాధించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో టీడీపీ అన్ని 32 వార్డులను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 79 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు గాను సుమారు 90% స్థానాలను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నాయి. టీడీపీ 50కి పైగా, జనసేన 15కి పైగా చోట్ల గెలుపొందాయి. వైఎస్సార్‌సీపీ కేవలం నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే గెలిచి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

ఫలితాలపై నేతల స్పందన

ఈ ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, ఇది అభివృద్ధి, సంక్షేమ రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని అన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా వైసీపీ పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. మరోవైపు, జగన్ స్పందిస్తూ, ఇది ఎన్నిక కాదని, అధికార బలంతో జరిగిన ఎంపిక అని ఆరోపించారు. పోలీసులు, ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించాయని, పులివెందులలో రీపోల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పందించారు. "ఈ తీర్పు సంబరాలకు కాదు, సేవ చేయడానికి ప్రజలు ఇచ్చిన ఆదేశం. గత రెండున్నరేళ్ల సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంగా మేము దీనిని వినయంగా స్వీకరిస్తున్నాము. విజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులందరికీ అభినందనలు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల సమష్టి కృషికి ధన్యవాదాలు. ఇక మా ఏకైక దృష్టి పార్టీలకు అతీతంగా ప్రతి పౌరుడికి సేవ చేయడమే. అహంకారానికి తావులేదు. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే మా నిజమైన బాధ్యత, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి గతంలో కంటే కష్టపడి పనిచేస్తాం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మరోవైపు, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ ఫలితాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రతి దశలోనూ కూటమి రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆయన ఆరోపించారు. కూటమి అక్రమాలకు పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సహకరించాయని విమర్శించారు.

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.. ఢిల్లీకి పాక్ పొగ సెగ

పడిపోయింది. దీపావళికి కొద్ది రోజుల ముందే ఈ పరిస్థితి నెలకొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లోని పంజాబ్, హర్యానాలతో పాటు పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న వ్యవసాయ వ్యర్థాల దహనమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ డేటా ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. అక్టోబర్ 1 నుంచి 29 మధ్య పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఏకంగా 13,241 వ్యవసాయ వ్యర్థాల దహనాలను గుర్తించగా, అదే సమయంలో భారత పంజాబ్‌లో 3,158 దహనాలు నమోదయ్యాయి. వాయవ్య దిశ నుంచి వీస్తున్న గాలులు ఈ పొగను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి మోసుకొస్తున్నాయి. దీనికి తోడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, గాలి వేగం మందగించడం వంటి కారణాలతో కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. స్థానిక కాలుష్యానికి ఈ పొగ తోడవడంతో పరిస్థితి మరింత దిగజారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్ఏపీ) స్టేజ్-2ను అమలులోకి తెచ్చారు. దీని కింద, రోడ్లపై నీళ్లు చల్లడం, యాంటీ-స్మాగ్ గన్‌ల వినియోగం, నిర్మాణ కార్యకలాపాలపై కఠిన నిషా వంటి చర్యలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో కూడా గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడం వల్ల కాలుష్యం మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం

అమరావతి, సిటిజన్ టైమ్స్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. వెలువడుతున్న ఫలితాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోందని తెలిపారు. సాయంత్రానికి పూర్తిస్థాయి ఫలితాలు వెలువడి, మరింత స్పష్టత రానుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ఆయన అభివర్ణించారు. "మేం చేస్తున్న సుపరిపాలనను మెచ్చి, మా పనితీరును గమనించే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారు. 'గుడ్ పాలిటిక్స్, గుడ్ గవర్నెన్స్' అనేదే నా ప్రాధాన్యత. రాజకీయమా, ప్రజల సమస్యల పరిష్కారమా అంటే.. నేను ఎప్పుడూ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుపాను సమయంలో మూడు రోజుల పాటు రాత్రింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నమైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ.. "అనునిత్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికే పనిచేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే వెలిగొండ ద్వారా నీటిని అందించాం. అమరావతి పనులు పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన రోడ్లను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని తెలిపారు. అయితే, అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదని, వారసత్వంగా వచ్చిన కొన్ని సమస్యలు ఇంకా ఉన్నాయని ఆయన అంగీకరించారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు. కొందరు విమర్శలు చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా ప్రజాసేవకే అంకితమయ్యామని చంద్రబాబు అన్నారు. "లబ్ధి పొందుతూ కూడా ఎగతాళి చేసేవారు ఉంటారు. కులాలు, మతాలు, మాకు ఓటు వేయని వారు అనే భేదాలు మేం చూడటం లేదు. అందరి కోసం పనిచేస్తున్నాం. ప్రజలు మెచ్చే పాలన అందించి, వారి ఇబ్బందులను దూరం చేయడమే మా లక్ష్యం" అని వివరించారు. ప్రజలు ఇదే విధంగా కూటమిని ఆశీర్వదించి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా.. విజయం కూటమిదే: పవన్ కల్యాణ్

ఇచ్చారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీకి దక్కిన బలమైన మద్దతు ఎంతో విలువైనది. ఛైర్మన్, మేయర్ అభ్యర్థులకు దక్కిన విజయాలు, ఆధిక్యతలు పరిశీలిస్తుంటే.. పట్టణ, నగర ప్రజలు జనసేనకి ఇస్తున్న ఆదరణ ఎంతో విలువైనది. వారు పార్టీ పట్ల కనబరిచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. జనసేన, తెదేపా, భాజపాకి అండగా నిలిచిన ఓటర్లకు, జనసేన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం. పురపాలక ఎన్నికల్లో వచ్చిన ఘన విజయాన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ సాధిస్తామనే విశ్వాసం ఉంది" అని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

24 గంటలు దాటింది మోదీ జీ.. చర్చకు వస్తున్నారా?: రాహుల్ గాంధీ

జరిగింది? క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఒక్కరే ఎందుకు ఆ ఒప్పందం చేసుకున్నారు? అదానీ కేసును ఎందుకు మూసివేశారు? ఇలా అనేక అంశాలపై మాట్లాడదాం. నాపై ఎన్నో ఆరోపణలు చేస్తున్నారు. పరువు నష్టం దావాలు కూడా వేశారు. మరి.. విదేశీ సంబంధాల ఆరోపణలపై ఎటువంటి దావా వేయలేదేం? దాని గురించి కూడా చర్చిద్దాం. వాస్తవాలు బయటకు రానివ్వండి. దీపావళి శుభాకాంక్షలు మోదీ జీ" అని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై ప్రధాని మోదీ ఇటీవల పరోక్ష విమర్శలు చేశారు. "విదేశాల్లో రహస్యంగా కొందరిని కలుస్తున్నది ఎవరు? భారత్‌ను వ్యతిరేకిస్తున్న శక్తుల మద్దతు అందుకుంటున్న వ్యక్తి ఎవరు? మన శత్రువుల భాషలో మాట్లాడుతోంది ఎవరు?" అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలను రాహుల్ తిప్పికొట్టారు. మోదీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని ప్రత్యారోపణ చేశారు. ఈ అంశంపై తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు.

విశాఖ మేయర్ పీఠం టీడీపీ కూటమి కైవసం..

కైవసం చేసుకున్నారు. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణిపై ఆమె 44 వేలకు పైగా ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల సరళిని పునరావృతం చేస్తూ, కూటమి అభ్యర్థులు కార్పొరేషన్ ఎన్నికల్లోనూ సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో కూటమి ప్రభంజనం స్పష్టంగా కనిపించింది. మొత్తం 120 డివిజన్లు ఉన్న బృహత్ విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో మేయర్ స్థానంతో పాటు, అత్యధిక డివిజన్లను కూడా కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. దీంతో పాలకవర్గంపై కూటమి పూర్తిస్థాయి పట్టు సాధించింది. ఈ గెలుపుతో విశాఖ నగరంలో టీడీపీ శ్రేణులు, కూటమి కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఈ చారిత్రక విజయం అనంతరం ముక్కా శ్రావణి మీడియాతో మాట్లాడారు. "విశాఖ ఎప్పటికీ తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని మరోసారి రుజువైంది. నాపై నమ్మకం ఉంచి ఇంత భారీ మెజారిటీతో గెలిపించిన నగర ప్రజలకు కృతజ్ఞతలు. ఈ గెలుపుతో మాపై బాధ్యత మరింత పెరిగింది. ప్రజల నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోము. విశాఖపట్నంను దేశంలోనే నంబర్ వన్ నగరంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం" అని ఆమె స్పష్టం చేశారు. విశాఖతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్‌లోనూ కూటమి జెండా ఎగరేసింది. ఇక్కడ జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు సత్తా చాటారు. ఆయన వైసీపీ అభ్యర్థిపై 44,665 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించడం విశేషం. మొత్తం మీద, ప్రధాన నగరాల్లో ఘన విజయాలు సాధించడం ద్వారా ప్రజల మద్దతు తమకే ఉందని అధికార కూటమి మరోసారి చాటుకుంది.

ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం పురపాలిక తీర్పుపై నారా లోకేశ్

ట్రెండ్ పై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమే ఈ విజయమని లోకేశ్ అభివర్ణించారు. ఈ విజయం కోసం సమష్టిగా కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కూటమి తరఫున గెలుపొందిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "ఎన్నికలు ముగిశాయి. ఇక మా ఏకైక లక్ష్యం సేవ మాత్రమే. పార్టీలకు అతీతంగా ప్రతి పౌరుడికి సేవ చేస్తాం. ఇక్కడ అహంకారానికి ఎలాంటి తావులేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ అసలైన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు గతంలో కంటే మరింత కష్టపడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, దానిని నిబద్ధతతో నెరవేరుస్తామని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

93వ వార్డులో జనసేన జెండా రెపరెపలు!

5 వేల ఓట్ల భారీ మెజారిటీతో

దల్లి గోవిందరెడ్డి ఘన విజయం

మాజీ డిప్యూటీ మేయర్కు ప్రజల అపూర్వ ఆదరణ



విశాఖపట్నం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

జీవీఎంసీ 93వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి దల్లి గోవిందరెడ్డి భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. సుమారు 5 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించి తన సత్తా చాటారు. గతంలో డిప్యూటీ మేయర్గా పనిచేసిన దల్లి గోవిందరెడ్డికి ప్రజలు మరోసారి తమ మద్దతు ప్రకటించారు. జనసేన పార్టీతో పాటు తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఎన్నికల ఫలితాలు వెలువడటంతో జనసేన శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ డిప్యూటీ మేయర్గా పనిచేసిన అనుభవంతో 93వ వార్డు అభివృద్ధికి ఆయన మరింత కృషి చేస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజాసేవకు అంకితమవ్వాలని అభిమానులు ఆకాంక్షించారు.

కూటమిపై ప్రజల నమ్మకానికి నిదర్శనం జీవీఎంసీ ఎన్నికల ఫలితాలు

యువ మేయర్ ముక్కా శ్రావణి విశాఖను

విశ్వనగరంగా అభివృద్ధి చేయాలి: గంటా శ్రీనివాసరావు




విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

జీవీఎంసీ ఎన్నికల ఫలితాలు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉందని ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ శాతం తక్కువగా నమోదైనప్పటికీ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. అత్యధిక మెజారిటీతో యువ మేయర్గా ఎన్నికైన ముక్కా శ్రావణి విశాఖ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. 2019లో వైసీపీ ప్రభంజనం కొనసాగిన సమయంలోనూ టీడీపీ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో విజయం సాధించి విశాఖలో తన పట్టును నిలబెట్టుకుందని గుర్తు చేశారు. జీవీఎంసీ పరిధిలోని గాజువాక, భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలు రాష్ట్ర స్థాయిలో అత్యధిక మెజారిటీ సాధించి వరుసగా 1, 2, 4 స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి, విజయం సాధించిన కార్పొరేటర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు గంటా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మరోసారి మద్దతు తెలిపిన విశాఖ ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మదనపల్లి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన గుండ్లపల్లి శ్రీ రామ్

మంత్రుల అభినందన



మదనపల్లి నవంబర్ 3సిటిజన్ టైమ్స్ :

మదనపల్లి మున్సిపల్ చైర్మెన్ గా టిడిపి పార్టీ అభ్యర్థి గా కూటమి నాయకులు, ప్రజల అండదండలతో విజయం సాధించిన శ్రీ రామ్ కుమార్ (చినబాబు)ను జిల్లా ఇన్చార్జి మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి మరియు జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని కలిసి అభినందించారు. మదనపల్లి టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్, జనసేన ఇంచార్జ్ రాందాస్ చౌదరి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

14వ వార్డులో కాకి గంగరాజు చారిత్రాత్మక విజయం..

తెరవెనుక ముగడ రాజారావు వ్యూహాత్మక కృషి!

9,013 ఓట్లతో విజయకేతనం.. 8,312 ఓట్ల భారీ మెజారిటీ

మొత్తం పోలైన ఓట్లలో 83.58 శాతం టీడీపీ కూటమి అభ్యర్థికే

బూత్ల వారీ సమగ్ర ప్రణాళిక.. ఓటర్లతో నిరంతర సంబంధాలు.. ఎన్నికల కార్యాచరణలో కీలక పాత్ర

వెలగపూడి రామకృష్ణబాబు సైతం ముగడ రాజారావు కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పార్టీ వర్గాల వెల్లడి







విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 14వ వార్డు ఫలితం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీడీపీ కూటమి అభ్యర్థి కాకి గంగరాజు ప్రత్యర్థులపై 8,312 ఓట్ల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. ఈ విజయానికి అభ్యర్థి కాకి గంగరాజు కృషితో పాటు 14వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ముగడ రాజారావు చేసిన నిరంతర శ్రమ, ఎన్నికల నిర్వహణలో ఆయన అనుసరించిన ప్రణాళిక, పార్టీ శ్రేణుల సమన్వయం కీలకంగా నిలిచాయని వార్డు ప్రజలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ఓట్ల లెక్కల్లో భారీ ఆధిక్యం..

14వ వార్డులో మొత్తం 10,783 ఓట్లు నమోదయ్యాయి. ఇందులో టీడీపీ కూటమి అభ్యర్థి కాకి గంగరాజుకు 9,002 సాధారణ ఓట్లు, 11 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 9,013 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 701 ఓట్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి 145 ఓట్లు, నోటాకు 569 ఓట్లు నమోదయ్యాయి. మరో 355 ఓట్లు చెల్లనివిగా తేలాయి. మొత్తం పోలైన ఓట్లలో కాకి గంగరాజుకు 83.58 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్కు 6.50 శాతం, ఆమ్ ఆద్మీ పార్టీకి 1.35 శాతం, నోటాకు 5.28 శాతం ఓట్లు నమోదయ్యాయి. చెల్లని ఓట్లు 3.29 శాతంగా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన 701 ఓట్లతో పోలిస్తే కాకి గంగరాజు 8,312 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఈ ఫలితం 14వ వార్డులో ఆయనకు లభించిన ప్రజా మద్దతును స్పష్టంగా తెలియజేస్తోంది.

బూత్ల వారీ ప్రణాళికతో ఎన్నికల కార్యాచరణ..

ఈ భారీ విజయానికి తెరవెనుక ముగడ రాజారావు పోషించిన పాత్ర ప్రత్యేకంగా చర్చనీయాంశమవుతోంది. ఎన్నికలకు ముందుగానే బూత్ల వారీగా ఓటర్ల జాబితాలను పరిశీలించడం, ప్రతి బూత్లో ఉన్న ఓటర్ల సంఖ్య, పోలింగ్కు సంబంధించిన వివరాలను విశ్లేషించడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించడం వంటి కార్యక్రమాల్లో ఆయన చొరవ చూపారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ప్రతి ఓటరును అభ్యర్థి కాకి గంగరాజు కలుసుకునేలా ప్రణాళిక రూపొందించడం, వారితో ఆత్మీయంగా మాట్లాడడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజలకు అభ్యర్థిని చేరువ చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెబుతున్నారు. ప్రచారం ఏ ప్రాంతంలో ఎలా సాగాలి? ఏ బూత్పై మరింత దృష్టి పెట్టాలి? పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎలా ఉండాలి? అనే అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేశారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. పోలింగ్ రోజున కూడా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, సౌకర్యవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించడం, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేయడం, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

గంగరాజు విజయమే లక్ష్యంగా నిరంతర శ్రమ..

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి కాకి గంగరాజుకు పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం అందేలా చూడడంతో పాటు ప్రతి ప్రాంతంలో ప్రచార కార్యక్రమాలు సమర్థవంతంగా జరిగేలా ముగడ రాజారావు కృషి చేశారని స్థానిక పార్టీ అభిమానులు చెబుతున్నారు. అభ్యర్థి గెలుపును తన బాధ్యతగా భావించి ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని దగ్గరుండి పర్యవేక్షించారని పేర్కొంటున్నారు. కాకి గంగరాజు సైతం తన విజయానికి ముగడ రాజారావు అందించిన సహకారం, ఎన్నికల సమయంలో ఆయన చేసిన కృషి ఎంతో కీలకమని అభిప్రాయపడుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కార్యకర్తలను సమన్వయం చేయడం నుంచి బూత్ల వారీగా ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడం వరకు ఆయన అందించిన సహకారం మరువలేనిదని అభ్యర్థి భావిస్తున్నట్లు చెబుతున్నారు.

వెలగపూడి రామకృష్ణబాబు ప్రశంసలు..

విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సైతం 14వ వార్డులో ఎన్నికల నిర్వహణ, పార్టీ శ్రేణుల సమన్వయం, కాకి గంగరాజు విజయ సాధనలో ముగడ రాజారావు పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. 14వ వార్డులో ఈ స్థాయి విజయం సాధించడంలో ముగడ రాజారావు చేసిన కృషి ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడినట్లు వెల్లడించారు.

విజయం వెనుక సమష్టి కృషి..

ప్రత్యేక గుర్తింపు మాత్రం ముగడ రాజారావుకు!

ఒకానొక దశలో ముగడ రాజారావు సహకారం లేకుండా కాకి గంగరాజు ఈ స్థాయి విజయాన్ని సాధించడం కష్టమనే అభిప్రాయం ప్రజలు, ఓటర్లు, కార్యకర్తల్లో వ్యక్తమైందంటే ఎన్నికల సమయంలో ఆయన నిర్వహించిన బాధ్యతల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. 14వ వార్డు ప్రజల మద్దతు, అభ్యర్థి కృషి, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి శ్రమతో పాటు ముగడ రాజారావు అందించిన సమన్వయం ఈ విజయానికి తోడ్పడిందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. 9,013 ఓట్లు.. 8,312 ఓట్ల మెజారిటీ.. 83.58 శాతం ఓట్ల మద్దతు.. ఇవన్నీ 14వ వార్డు ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేకంగా నిలిచాయి. కాకి గంగరాజు విజయంతో పాటు ఆ విజయ సాధనలో ముగడ రాజారావు పోషించిన పాత్ర కూడా ఇప్పుడు 14వ వార్డు రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

15వ వార్డు రారాజు.. అప్పలరాజు!

1,996 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం.. టీడీపీ కూటమి అభ్యర్థిగా విజయకేతనం



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 15వ వార్డు నుంచి టీడీపీ కూటమి తరపున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఓమ్మి అప్పలరాజు 1,996 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఫలితంతో 15వ వార్డులో రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే టీడీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలను నేరుగా కలుసుకోవడం, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవడం, వార్డు అభివృద్ధిపై తన ఆలోచనలను వివరించడం ద్వారా ఓటర్లకు చేరువయ్యేందుకు అప్పలరాజు కృషి చేశారు. పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తల సహకారంతో ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తూ ఓటర్ల మద్దతును కోరారు. ఈ ఎన్నికల్లో లభించిన 1,996 ఓట్ల ఆధిక్యం ఆయనకు దక్కిన ప్రజా మద్దతును తెలియజేస్తోందని పార్టీ అభిమానులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్థానికంగా పార్టీ శ్రేణుల సమష్టి కృషి, ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల సహకారం ఈ విజయానికి తోడ్పడ్డాయని వారు అభిప్రాయపడుతున్నారు.

విజయం బాధ్యతను పెంచింది..

ఎన్నికల్లో గెలుపుతో పాటు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఇప్పుడు అప్పలరాజు ముందున్న ప్రధాన బాధ్యత. 15వ వార్డులో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు ఆశిస్తున్నారు. వార్డు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుకుంటున్నారు.


15వ వార్డులో రారాజు.. అప్పలరాజు!

భారీ మెజారిటీతో సాధించిన ఈ విజయం ఓమ్మి అప్పలరాజు రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. తన గెలుపునకు సహకరించిన ఓటర్లకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. 15వ వార్డులో ఇప్పుడు అభిమానుల నినాదం ఒక్కటే.. రారాజు అప్పలరాజు!.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం!

కె. జగన్నాథపురంలో ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరిన గిడ్డి సత్యనారాయణ

గ్రామాల అభివృద్ధికి స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



అయినవిల్లి, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ఎన్నికల ప్రచారానికి అడ్డంకి కాలేదు. పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వర్షంలోనే గ్రామాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు కూడగట్టారు. అయినవిల్లి మండలం కె. జగన్నాథపురంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వర్షంలోనూ వీధివీధికీ ప్రచారం

భారీ వర్షాన్ని సైతం పట్టించుకోకుండా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులను నేరుగా కలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

గ్రామాల అభివృద్ధికి స్థానిక సంస్థలే కీలకం

ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన ప్రజాప్రతినిధులు ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరడంతో పాటు గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడానికి స్థానిక సంస్థల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ప్రజలతో మమేకమవుతూ ప్రచారం

వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రచారంలో స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుర్రంకొండ జడ్పిటిసి గెలుపు కోసం చెర్లోపల్లి లో ప్రచారం

గుర్రంకొండ నవంబర్ 3సిటిజన్ టైమ్స్

గుర్రంకొండ జడ్పిటిసి టిడిపి అభ్యర్థి ఎజాజ్ అహమ్మద్ విజయం కోసం చెర్లోపల్లి గ్రామంలో దద్దాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ టిడిపి అభ్యర్థి ఎజాజ్ అహమ్మద్ ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, టిడిపి విజయం సాధిస్తే చెర్లోపల్లి గ్రామం లో అభివృద్ధికి చేయవచ్చని ప్రచారంలో ప్రజలకు విన్నవించారు. ఈ ప్రచారం లో హిరి ప్రసాద్ నాయుడుతో పాటు గురంకొండకు చెందిన నాయకులు నక్కా సతీష్, బట్టీల శంకర, ఆర్ ఎస్ ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గోవింద్ నామస్మరణతో మారుమోగిన కొండవాలు ప్రాంతం!

పదేళ్ల ప్రజా అనుబంధానికి గుర్తింపు.. 4,619 ఓట్ల భారీ మెజారిటీతో బుడుమూరి గోవింద్ ఘన విజయం!

6,442 ఓట్లు సాధించిన టీడీపీ కూటమి అభ్యర్థి.. వైఎస్సార్సీపీకి 1,823 ఓట్లు

హనుమంతవాక నుంచి దీనదయాలపురం వరకు ప్రజల ఆదరణ.. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి రిటైనింగ్ వాల్స్ నిర్మాణంపై భరోసా

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

గత పదేళ్లుగా ప్రజల మధ్య ఉంటూ, స్థానిక సమస్యల్లో భాగస్వామిగా కొనసాగిన బుడుమూరి గోవిందు 17వ వార్డు ఓటర్లు ఘన విజయాన్ని అందించారు. జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన 6,442 ఓట్లు సాధించి, వైఎస్సార్సీపీ అభ్యర్థిపై 4,619 ఓట్ల భారీ మెజారిటీతో విజయం నమోదు చేశారు. వైఎస్సార్సీపీ అభ్యర్థికి 1,823 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఫలితంతో హనుమంతవాక నుంచి దీనదయాలపురం వరకు కొండవాలు ప్రాంతాల్లో గోవింద్ పేరు మారుమోగుతోంది.





ఎన్నికల కోసం వచ్చిన నాయకుడు కాదు.. పదేళ్లుగా ప్రజల మధ్యే!

బుడుమూరి గోవింద్ గత పదేళ్లుగా స్థానికుడిగా ఉంటూ హనుమంతవాక నుంచి దీనదయాలపురం వరకు వివిధ కాలనీలు, సంఘాలు, యువతతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. ఆయా సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడం, యువతకు అవసరమైన సందర్భాల్లో చేదోడువాదోడుగా నిలవడం, స్థానిక సమస్యలపై స్పందించడం వంటి కార్యక్రమాలతో ప్రజలకు చేరువయ్యారు. ప్రతి సంఘంలోనూ యువతతో పరిచయాలు పెంచుకుంటూ, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

కొండవాలు ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక హామీ!

17వ వార్డులోని కొండవాలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గోవింద్ ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, వర్షాకాలంలో కొండచరియల ప్రమాదాల నివారణ, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కొండవాలు ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు భద్రత కల్పించే రక్షణ గోడల నిర్మాణాన్ని ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ముందుకు తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు.

ప్రతి సంఘంతో అనుబంధం.. యువతకు చేదోడువాదోడు!

హనుమంతవాక నుంచి దీనదయాలపురం వరకు ఉన్న వివిధ సంఘాల ప్రతినిధులు, యువత, స్థానిక కుటుంబాలతో ఆయనకు ఉన్న అనుబంధం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. పదేళ్లుగా తమ ప్రాంతంలోనే ఉంటూ, తమ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అవసరమైనప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తిగా గోవిందు గుర్తించామని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికుడిగా ప్రతి ప్రాంతంలోని సమస్యలపై అవగాహన కలిగి ఉండటం ఆయనకు ప్రజలతో మరింత అనుబంధాన్ని పెంచిందని అభిప్రాయపడుతున్నారు.

6,442 ఓట్లు.. 4,619 ఓట్ల మెజారిటీ!

ఎన్నికల ఫలితాల్లో బుడుమూరి గోవిందు 6,442 ఓట్లు లభించగా, వైఎస్సార్సీపీ అభ్యర్థికి 1,823 ఓట్లు వచ్చాయి. దీంతో 4,619 ఓట్ల భారీ ఆధిక్యంతో గోవింద్ విజయం సాధించారు. ఈ ఫలితం 17వ వార్డులో నమోదైన ప్రధాన ఎన్నికల విశేషంగా నిలిచింది. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో పాటు స్థానిక ప్రజల మద్దతు ఈ విజయానికి తోడ్పడిందని అభిమానులు పేర్కొంటున్నారు.

ఇక హామీలను ఆచరణలో పెట్టడమే లక్ష్యం!

భారీ మెజారిటీతో గెలిచిన గోవిందై ఇప్పుడు వార్డు ప్రజల అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువచ్చి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ఆయన ముందున్న ప్రధాన బాధ్యతగా నిలవనుంది. పదేళ్ల ప్రజా అనుబంధం, స్థానికంగా అందించిన సహకారం, అభివృద్ధిపై ఇచ్చిన భరోసా.. ఇవన్నీ 17వ వార్డు ఎన్నికల్లో బుడుమూరి గోవింద్ విజయానికి సంబంధించిన ప్రధాన అంశాలుగా నిలిచాయి. హనుమంతవాక నుంచి దీనదయాలపురం వరకు ఇప్పుడు వినిపిస్తున్న పేరు ఒక్కటే.. బుడుమూరి గోవింద్!

వైఎస్సార్ కుటుంబ కంచుకోటలో టీడీపీ జెండా

50 ఏళ్ల ఆధిపత్యానికి తెర..

పులివెందుల మున్సిపాలిటీ టీడీపీ కైవసం

13,875 ఓట్ల మెజారిటీతో తుగుట్ల గీతాకుమారి విజయం



పులివెందుల, సిటిజన్ టైమ్స్, నవంబర్ 03:

కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసింది. గత ఐదు దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబానికి కంచుకోటగా కొనసాగుతున్న పులివెందుల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపాలిటీలో మొత్తం 40 వార్డులు ఉండగా, టీడీపీ తరఫున 20 వార్డుల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగిలిన 20 వార్డుల్లో 17 స్థానాలను టీడీపీ కైవసం చేసుకోగా, వైఎస్సార్సీపీ మూడు స్థానాల్లో విజయం సాధించింది. మున్సిపల్ చైర్పర్సన్ పదవికి జరిగిన పోటీలో టీడీపీ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి, వైఎస్సార్సీపీ అభ్యర్థి వైఎస్ ప్రేమిలపై 13,875 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో పులివెందుల మున్సిపాలిటీపై టీడీపీ పట్టు సాధించింది. పులివెందుల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. విజయోత్సాహంతో పార్టీ శ్రేణులు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

ముమ్మిడివరం నగర పంచాయతీ పీఠం కూటమి కైవసం

2,299 ఓట్ల భారీ మెజారిటీతో జనసేన అభ్యర్థి

గుబ్బల గంగారత్న భవాని ఘన విజయం



ముమ్మిడివరం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది. కూటమి తరఫున జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గుబ్బల గంగారత్న భవాని తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి సానబోయిన సునీలాదేవిపై 2,299 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం సోదరి అయిన గుబ్బల గంగారత్న భవాని విజయం సాధించడంతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ విజయంతో ముమ్మిడివరం నగర పంచాయతీ ఛైర్పర్సన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. జనసేన అభ్యర్థికి ప్రజలు భారీ మెజారిటీతో మద్దతు పలకడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గంగారత్న భవాని విజయంతో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ ఫలితం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

అమలాపురం 28వ వార్డులో ఉత్కంఠ పోరు!

110 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి

మోకా వెంకట సుబ్బారావు విజయం

అమలాపురం, నవంబర్ 02 (సిటిజన్ టైమ్స్):

అమలాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో 28వ వార్డు ఫలితం చివరి వరకు ఉత్కంఠ రేపింది. హోరాహోరీగా సాగిన పోరులో బీజేపీ అభ్యర్థి మోకా వెంకట సుబ్బారావు తన ప్రత్యర్థిపై 110 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. విజయం అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసి గెలిపించిన వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపును వ్యక్తిగత విజయంగా కాకుండా వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనంగా భావిస్తున్నానన్నారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మోకా వెంకట సుబ్బారావు విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.



గుర్రంకొండలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

డ్రైనేజీ సమస్యలపై బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



గుర్రంకొండ నవంబర్ 3సిటిజన్ టైమ్స్

గుర్రంకొండ జడ్పిటిసి కాంగ్రెస్ అభ్యర్థి ఖాజా మహమ్మద్ హుస్సేన్ విజయానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మంగళవారం గుర్రంకొండలో రెండవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఇందులో భాగంగా స్థానిక వీధిలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, హుస్సేన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.పాల కుల విఫలం వలన ఇండ్లలోకి డ్రైనేజీ నీరు చేరే పరిస్థితి చూసి విచారం వ్యక్తం చేశారు.ప్రచారంలో భాగంగా వీధిలోని స్థానిక సమస్యలను సోమశేఖర్ రెడ్డి పరిశీలించారు. కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు. ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు మురుగునీరు, దుర్వాసన మధ్య నరకయాతన అనుభవిస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజల ఆరోగ్యంపై కనీస బాధ్యత లేని ఇలాంటి పాలకులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గుర్రంకొండలోని అన్ని వీధుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సమీరుద్దీన్, నాయకులు ఎస్.కె. బాషా, సింగం రామకృష్ణ రెడ్డి, మల్లిక, గౌస్, అఫ్రోజ్, అర్షద్, షేక్ సవ్వల్లితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభి మానులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పారిశుధ్యం పై సమావేశం నిర్వహించిన కమిషనర్



సిటిజెన్ టైమ్స్ మహబూబాబాద్ నవంబర్ 3

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పట్టణంలో పందుల నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఈరోజు మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పందుల పెంపకందారులు తమ పందులను మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వారంరోజుల్లోగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా పందులు కనిపించకుండా చూసుకోవాలని పందుల పెంపకందారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత గడువు అనంతరం పట్టణ పరిధిలో ఎక్కడైనా పందులు సంచరిస్తున్నట్లయితే మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టుకునే చర్యలు చేపడతారని హెచ్చరించారు.పట్టణ పరిశు భ్రతను కాపాడటంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ వినోద్ కుమార్ కోరారు.

జీవీఎంసీపై కూటమి జెండా.. 98 డివిజన్లలో విజయదుందుభి!

64 స్థానాలతో టీడీపీ అతిపెద్ద పార్టీగా అవతరణ.. జనసేనకు 26, బీజేపీకి 8 స్థానాలు.. 120 వార్డులకు వెలువడిన తుది ఎన్నికల ఫలితాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3

గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 120 వార్డులకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తికావడంతో మంగళవారం రాత్రి 10 గంటలకు అధికారులు తుది ఫలితాలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో కూటమి అభ్యర్థులు 98 వార్డులను కైవసం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ 64 స్థానాలను గెలుచుకుని జీవీఎంసీలో అతిపెద్ద పార్టీగా నిలవగా, జనసేన పార్టీ 26 వార్డుల్లో, భారతీయ జనతా పార్టీ 8 వార్డుల్లో విజయం సాధించాయి. దీంతో మూడు పార్టీల కూటమి మొత్తం 98 స్థానాలను దక్కించుకుంది. వార్డుల వారీగా వెల్లడైన ఫలితాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13 స్థానాల్లో విజయం సాధించింది. స్వతంత్ర అభ్యర్థులు ఎనిమిది వార్డుల్లో గెలుపొందగా, సీపీఐ ఒక స్థానాన్ని దక్కించుకుంది. స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించిన వార్డులు 36, 39, 41, 73, 86, 98, 106, 118 కాగా, 105వ వార్డులో సీపీఐ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో మొత్తం 120 వార్డులకు సంబంధించిన ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెల్లడయ్యాయి. ఎన్నికల ఫలితాలతో జీవీఎంసీ పరిధిలో కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. నగరంలోని తాగునీటి సమస్యలు, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో కొత్త పాలకవర్గం ఎలాంటి చర్యలు చేపడుతుందోనని విశాఖ నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తాం

ఇది ప్రజా విజయం.. కూటమి నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి ఫలితం

టీడీపీ నాయకుడు తుగుట్ల మధుసూదన్ రెడ్డి

పులివెందుల, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

పులివెందుల మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు తుగుట్ల మధుసూదన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి మున్సిపల్ చైర్పర్సన్గా విజయం సాధించడం ప్రజా విజయమని ఆయన పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీని కైవసం చేసుకోవడంలో కూటమి నాయకులు, కార్యకర్తల ఐక్యత, సమిష్టి కృషి కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి, వేముల నాయకుడు పార్థసారథితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అందించిన సహకారంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. పులివెందులలోని ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలిసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో పులివెందుల మున్సిపాలిటీని అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామన్నారు. టీడీపీ, కూటమి కార్యకర్తలు ఎంతో పట్టుదలతో కష్టపడి పనిచేసి అభ్యర్థుల



విజయానికి కృషి చేశారని కొనియాడారు. సుమారు పదేళ్ల క్రితం స్వతంత్ర అభ్యర్థులుగా 3, 4, 5, 6 వార్డుల్లో పోటీ చేయగా, ఒక వార్డులో మాత్రమే విజయం సాధించామని గుర్తుచేశారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో కూటమి బలం పెరిగి మున్సిపాలిటీలో 37 మంది కౌన్సిలర్లు గెలుపొందడంతో పాటు చైర్పర్సన్ పదవిని దక్కించుకోవడం సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్పర్సన్ తుగుట్ల గీతాకుమారి మాట్లాడుతూ తన విజయం ప్రజల విజయమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పులివెందుల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని అన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఎన్నికల ప్రచారం



ఐ.పోలవరం సిటిజన్ టైమ్స్ నవంబర్ 3

మండలంలోని ఐ. పోలవరం గ్రామంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను, ఓటర్లను కలుసుకుని కూటమి అభ్యర్థులకు తమ మద్దతు తెలియజేయాలని కోరారు. ఐ.పోలవరం గ్రామ ఎంపీటీసీ-1 స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థి గాజు గ్లాస్ గుర్తుకు, ఎంపీటీసీ-2 స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సైకిల్ గుర్తుకు, అలాగే ఐ.పోలవరం మండల జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సైకిల్ గుర్తుకు ఓటు వేసి, ముగ్గురు అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఐ.పోలవరం మండల జెడ్పీటీసీ అభ్యర్థి బీర సత్యకుమారి, ఎంపీటీసీ అభ్యర్థి గుత్తుల సాయి, మండల టీడీపీ అధ్యక్షులు సాగి రాజు సూరిబాబు రాజు, రాయపురెడ్డి రాజా, కాకర్లపూడి రాజేష్, కాకర్లపూడి బుజ్జి, బొంతు సత్యప్రసాద్, రాయపరెడ్డి సిద్ధు, స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరువానలోనూ జోరుగా ఎన్నికల ప్రచారం!

వర్షాన్ని లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లిన వైఎస్సార్సీపీ అభ్యర్థి విత్తనాల శాంతకుమారి

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



ముమ్మిడివరం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముమ్మిడివరం మండలం ఠాణేలంకలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్సీపీ ఎంపీటీసీ అభ్యర్థి విత్తనాల శాంతకుమారి ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా జోరువానలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీటీసీగా, ముమ్మిడివరం మండలం జడ్పీటీసీ అభ్యర్థి మోకా రామారావును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. వర్షం కురుస్తున్నప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జగతా బాబ్జి, మాజీ ఎంపీటీసీ బొంతు శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిదిండి రాజేష్, నక్కా శివకుమార్, నాతి నాగేశ్వరరావు, సుందరపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేట మున్సిపాలిటీపై కూటమి క్లీన్ స్వీప్!

17,995 ఓట్ల భారీ మెజారిటీతో చైర్మన్ వేగుళ్ల అజయ్ కుమార్ ఘన విజయం

మొత్తం 36 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయభేరి

మండపేట, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):



మండపేట పురపాలక సంఘం ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. మున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన వేగుళ్ల అజయ్ కుమార్ 17,995 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఎన్నికల అధికారి వెల్లడించిన ఫలితాల ప్రకారం అజయ్ కుమార్‌కు 27,187 ఓట్లు లభించగా, ఆయన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కాట్రవత్తు రాముకు 9,192 ఓట్లు వచ్చాయి. దీంతో 17,995 ఓట్ల ఆధిక్యంతో అజయ్ కుమార్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. మండపేట మున్సిపాలిటీలోని మొత్తం 36 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేకతగా నిలిచింది. చైర్మన్ అభ్యర్థి సైతం భారీ మెజారిటీ సాధించడంతో కూటమి శ్రేణుల్లో విజయోత్సాహం వెల్లివిరిసింది. ఇతర అభ్యర్థుల విషయానికి వస్తే కాంగ్రెస్ అభ్యర్థి ఆలమండ సూరిబాబుకు 108 ఓట్లు, నవతరం పార్టీ అభ్యర్థి నందికొళ్ల రాజుకు 87 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి కోన వీర వెంకట సత్యనారాయణకు 16 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి వీరభద్రరావు చిట్టూరికి 109 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాసరావు టేకుమూడికి 12 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో వేగుళ్ల అజయ్ కుమార్‌కు 23 ఓట్లు, డాక్టర్ కాట్రవత్తు రాముకు 5 ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఎన్నికల అధికారులు వేగుళ్ల అజయ్ కుమార్‌ను విజేతగా ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మొత్తం 36 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో మండపేటలో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి - మంత్రి సుభాష్

గంగవరం, కాజులూరు మండలాల్లో మంత్రి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్ విస్తృత ప్రచారం

గ్రామాల అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపండి: మంత్రి సుభాష్ -జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారానికి

కాజులూరు, సిటిజన్ టైమ్స్ నవంబర్ 03:

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో రామచంద్రపురం నియోజకవర్గంలో కూటమి నాయకులు ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మంగళవారం కె.గంగవరం, కాజులూరు మండలాల్లో సుడిగాలి పర్యటన నిర్వహిస్తూ కూటమి అభ్యర్థుల తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండలాల్లోని వివిధ గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని ప్రజలను అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనలో స్థానిక సంస్థల పాత్రను వివరిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధించాలంటే స్థానిక సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రజాప్రతినిధులు అవసరమని పేర్కొన్నారు. అందుకే జడ్పీటీసీ,





ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యకర్తల సమావేశాల్లో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ, ఇంటింటి ప్రచారంలో ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల ప్రచార చివరి రోజు కావడంతో ప్రతి గ్రామంలోనూ సమన్వయంతో ప్రచారం నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్ పర్యటనలో ఆయా మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బరిలో నిలిచిన కూటమి అభ్యర్థుల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. గంగవరం, కాజులూరు మండలాల్లో రోజంతా కొనసాగిన ప్రచార కార్యక్రమాలతో ఎన్నికల సందడి నెలకొంది. ఈ ప్రచార కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ , కే గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, పెద్ద ఎత్తున కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

600 మంది పోలీసులతో బందోబస్తు.. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



విజయనగరం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

విజయనగరం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపీఎస్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణం, నెల్లిమర్ల సి.కే.ఎం.జె. కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎస్పీ తనిఖీ చేశారు. అనధికార వ్యక్తులు కౌంటింగ్ కేంద్రాల వైపు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రతా విధుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బందితో కలిపి సుమారు 600 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డులు కలిగిన అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే నిర్దేశిత ప్రాంతాల్లోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు, వాటర్ బాటిళ్లు, ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర నిషేధిత వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా గుమిగూడడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం నిషేధమన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పికెట్లు, పెట్రోలింగ్, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలపై వచ్చే వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో ధ్రువీకరించని వార్తలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ప్రజలకు సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ప్రజలందరూ సంయమనంతో వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో ఎఆర్ అదనపు ఎస్పీ పి. కిరణ్ కుమార్, విజయనగరం డీఎస్పీ ఎస్. లక్ష్మణమూర్తి, పలువురు సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆగని ఎన్నికల ప్రచారం

ప్రజల మధ్యే ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అయినవిల్లి, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి బలపరిచిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల విజయం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి బలపరిచిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవడం, అభ్యర్థులకు మద్దతు కోరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అసాధ్యమనుకున్న 17వ వార్డులో కూటమి చారిత్రాత్మక విజయం!

ఎమ్మెల్యే ఆనందరావుపై నమ్మకంతో టీడీపీ అభ్యర్థికి పట్టం

17వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా: నూతన కౌన్సిలర్ గెల్లా మీనాకుమారి



అమలాపురం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

అమలాపురం మున్సిపాలిటీలో రాజకీయంగా ఆసక్తికరంగా మారిన 17వ వార్డులో కూటమి అభ్యర్థి గెలుపొందడం ప్రాధాన్యత సంతరించుకుంది. తీవ్ర పోటీ ఉంటుందని భావించిన ఈ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెల్లా మీనాకుమారి విజయం సాధించారు. ఎమ్మెల్యే ఆనందరావుపై ప్రజలకు ఉన్న విశ్వాసం, వార్డుపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధ, గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఈ విజయానికి దోహదపడ్డాయని స్థానిక కూటమి నాయకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన కౌన్సిలర్ సత్కారం

విజయం అనంతరం నూతన కౌన్సిలర్ గెల్లా మీనాకుమారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆనందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. తన విజయానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ వార్డుగా అభివృద్ధి చేస్తా

ఈ సందర్భంగా గెల్లా మీనాకుమారి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆనందరావు సహకారంతో 17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆకాంక్షించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డులోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

విశాఖ ప్రజల తీర్పు.. అభివృద్ధికి మద్దతు!

'సేవ్ వైజాగ్' కాదు.. 'సేవ్ వైసీపీ' అనాల్సిన పరిస్థితి వచ్చింది

వైసీపీ నినాదాలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వ్యంగ్యాస్త్రాలు

టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:



విశాఖ నగర ప్రజలు తమ ఓటుతో అభివృద్ధికి మద్దతు తెలిపారని, జీవీఎంసీ ఎన్నికల ఫలితాలు ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా వైసీపీ చేపట్టిన ప్రచార నినాదాలపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విశాఖలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు ఎన్నికల సమయంలో 'సేవ్ వైజాగ్' అంటూ నినాదాలు చేశారని, అయితే ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితిని చూస్తుంటే 'సేవ్ వైసీపీ' అని నినదించుకోవాల్సిన అవసరం ఏర్పడిందంటూ వ్యాఖ్యానించారు. విశాఖను కాపాడాలంటూ ప్రజల ముందుకు వచ్చిన వైసీపీకి ప్రజలే తమ ఓట్ల ద్వారా సమాధానం చెప్పారని ఎద్దేవా చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్పు

విశాఖ నగర భవిష్యత్తు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తమ నిర్ణయాన్ని వెల్లడించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో వివిధ రాజకీయ పార్టీలు చేసిన ప్రకటనలు, నినాదాలను పరిశీలించిన ఓటర్లు తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో వ్యక్తం చేశారని తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ నగర అభివృద్ధికి మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దుష్ప్రచారాలకు ప్రజల తీర్పే సమాధానం

ఎన్నికల సమయంలో వైసీపీ చేసిన విమర్శలు, ప్రచారాలను ప్రజలు విశ్వసించలేదని వంశీకృష్ణ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. విశాఖ అభివృద్ధి, భవిష్యత్తుపై ప్రజలు తమకు ఉన్న ప్రాధాన్యతను ఎన్నికల ఫలితాల ద్వారా వెల్లడించారని తెలిపారు. ప్రజలు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

విజయంతో బాధ్యత మరింత పెరిగింది

ఎన్నికల్లో ప్రజలు అందించిన మద్దతు కూటమి నాయకులపై మరింత బాధ్యతను పెంచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విశాఖ నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజా తీర్పుతో మహాలక్ష్మికి విజయలక్ష్మి వరం!

16వ వార్డులో 4,805 ఓట్ల మెజారిటీతో కూటమి అభ్యర్థి ఘన విజయం

విజయం వెనుక రెండేళ్లుగా సాగిన ఏడువాక సన్యాసిరావు క్షేత్రస్థాయి కృషి

ప్రతి కుటుంబంతో అనుబంధం.. ప్రతి కాలనీలో పర్యటన.. యువతతో నిరంతర సంబంధాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

జీవీఎంసీ 16వ వార్డు ఎన్నికల్లో కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏడువాక శ్రీ మహాలక్ష్మి ఘన విజయం సాధించారు. ఆమెకు 8,392 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి సత్యాల సాగరికకు 3,587 ఓట్లు లభించాయి. దీంతో ఏడువాక శ్రీ మహాలక్ష్మి 4,805 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ విజయానికి ఆమె భర్త ఏడువాక సన్యాసిరావు చేసిన కృషి కూడా ముఖ్యమైనదిగా స్థానిక పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఏడువాక సన్యాసిరావు 16వ వార్డులోని ప్రతి కుటుంబంతో, ప్రతి వ్యక్తితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. వార్డులోని ప్రతి కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారి అవసరాలను గుర్తించడం, పరిష్కార మార్గాల కోసం సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ముఖ్యంగా యువతతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, ప్రతి కాలనీలో యువతను కలుపుకొని పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తూ, వారి కుటుంబాల్లో జరిగే శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లోనూ భాగస్వామిగా ఉంటూ వార్డు ప్రజలకు దగ్గరయ్యారని చెబుతున్నారు. 16వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో



అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏడువాక సన్యాసిరావు నిరంతరం కృషి

చేశారని పార్టీ నాయకులు వెల్లడిస్తున్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ, ఆయా ప్రాంతాల ప్రజలతో చర్చిస్తూ ముందుకు సాగారని పేర్కొంటున్నారు. 16వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పార్టీ బాధ్యతలను నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించడం ఆయన పనితీరులో భాగమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సమయంలోనూ వార్డులోని ప్రతి ప్రాంతానికి చేరుకునేలా ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేయడం, ప్రజలను కలవడం, అభ్యర్థి తరఫున విస్తృతంగా పనిచేయడం వంటి అంశాల్లో ఏడువాక సన్యాసిరావు చేసిన కృషి ఏడువాక శ్రీ మహాలక్ష్మి విజయానికి ఎంతగానో తోడ్పడిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. గత రెండేళ్లుగా ప్రజలతో కొనసాగించిన అనుబంధం, క్షేత్రస్థాయిలో చేసిన సేవలు ఈ ఎన్నికల్లో తమకు ఉపయోగపడ్డాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. భారీ మెజారిటీతో విజయం సాధించిన ఏడువాక శ్రీ మహాలక్ష్మిపై ఇప్పుడు వార్డు ప్రజలు ఎన్నో అభివృద్ధి ఆశలు పెట్టుకున్నారు. గతంలో గుర్తించిన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి కాలనీకి సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలతో ఏర్పడిన అనుబంధాన్ని కొనసాగిస్తూ, వారి సమస్యలకు పరిష్కారం చూపడమే కొత్త కార్పొరేటర్ ముందున్న ప్రధాన బాధ్యతగా నిలవనుంది.

మోహిని అలంకరణలో కనువిందు చేసిన కోనసీమ తిరుమలేశుడు



ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ నవంబర్ 3

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం చంద్రప్రభ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అలంకరణలో చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని దర్శించుకున్న భక్తజనం ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, హనుమత్ మూలమంత్ర హవనం, దిగ్దేవతా బలిహరణ, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏకాంత సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుర్రంకొండలో సాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

ఎంపీడీవో ఆఫీస్ వద్ద రాజకీయ పార్టీల నాయకులు



గుర్రంకొండ నవంబర్ 3సిటిజన్ టైమ్స్

స్థానిక గుర్రంకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ అత్యంత సజావుగా మరియు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రానికి తరలి వస్తున్నారు.అధి కారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటింగ్ ప్రక్రియ సాగుతోంది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.కార్యాలయం వెలుపల కార్యకర్తల సందడే సందడి.కార్యాలయం లోపల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుండగా, మరోవైపు ఎంపీడీవో ఆఫీస్ చుట్టుపక్కల పరిసరాలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయాయి. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తమ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను ప్రసన్నం చేసు కునేందుకు, తమ వైపు తిప్పుకునేందుకు కార్యకర్తలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆఫీస్ ఆవరణ వెలుపల రాజకీయ సమీకరణాలు,గెలుపు ఓటములపై జోరుగా చర్చలు సాగుతుండటంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

అర్నాబ్ తుఫాన్ కష్టాలు తీరకముందే.. మరసు వర్షాల ముంచెత్తుడు!

చీకట్లోనే కోనసీమ పల్లెలు.. వారం దాటినా పునరుద్ధరణ కాని విద్యుత్ సరఫరా

వర్షాలతో జలమయమైన రహదారులు.. నిలిచిపోయిన జనజీవనం



రాజోలు, నవంబర్ 02 (సిటిజన్ టైమ్స్):

ఒకవైపు అర్నాబ్ తుఫాన్ సృష్టించిన నష్టం నుంచి కోలుకోకముందే మరోవైపు మురసు వర్షాలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. వరుస ప్రకృతి వైపరీత్యాలతో గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. వారం రోజులు దాటినా కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

చీకట్లో మగ్గుతున్న పల్లెలు.. విద్యుత్ కోసం ఎదురుచూపులు

అర్నాబ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించే పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆవేదన

-విద్యుత్ పనుల్లో జాప్యంపై ప్రజల ఆగ్రహం

వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు విద్యుత్ అంతరాయం, మరోవైపు కుండపోత వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ పనులపై సమర్థవంతమైన పర్యవేక్షణ కొరవడిందని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సైతం వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

కాలువలను తలపిస్తున్న వీధులు.. బయటకు రాలేని పరిస్థితి

మురసు వర్షాల ప్రభావంతో గ్రామాల్లోని రోడ్లు, వీధులు నీటమునిగి కాలువలను తలపిస్తున్నాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లలోనూ ఉండలేని విధంగా వర్షపు నీరు చేరడంతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు.

దెబ్బతిన్న ఇళ్లు, పాఠశాలలపై ఆందోళన

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పాఠశాలల పరిస్థితిపై సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో నష్టాన్ని పరిశీలించి బాధితులకు సహాయం అందించాల్సిన వీఆర్వోల పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస తుఫాన్లు, భారీ వర్షాలతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన కోనసీమ ప్రజలకు తక్షణ సహాయక చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, నీటి నిల్వల తొలగింపు, దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గొల్లప్రోలు మున్సిపాలిటీపై కూటమి పాగా!

8,437 ఓట్ల భారీ మెజారిటీతో జనసేన అభ్యర్థి కడారి

తమ్మయ్య నాయుడు ఘన విజయం

చైర్పర్సన్ పీఠం కైవసం చేసుకున్న కూటమి



గొల్లప్రోలు, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

గొల్లప్రోలు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. చైర్పర్సన్ పదవికి కూటమి తరఫున జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కడారి తమ్మయ్య నాయుడు భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి చెక్కపల్లి నాగేశ్వరరావు (దివాణం)పై 8,437 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపులో కడారి తమ్మయ్య నాయుడుకు 11,757 ఓట్లు లభించగా, వైఎస్సార్సీపీ అభ్యర్థి చెక్కపల్లి నాగేశ్వరరావుకు 3,320 ఓట్లు వచ్చాయి. దీంతో ఇద్దరి మధ్య 8,437 ఓట్ల భారీ వ్యత్యాసం నమోదైంది. ఈ ఫలితంతో గొల్లప్రోలు మున్సిపల్ చైర్పర్సన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. తమ్మయ్య నాయుడు విజయంతో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. నాయకులు, కార్యకర్తలు విజయాన్ని పురస్కరించుకుని సంబరాలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

-అండగా నిలిచిన గూడెం

మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్..

-విద్యుత్ శాఖ తరపున నష్టపరిహారం అందించేలా చర్యలు..

పటాన్చెరు సిటిజన్ టైమ్స్ నవంబర్ 3



తాను నివసిస్తున్న ఇంటివద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అండగా నిలిచారు. బీహార్ రాష్ట్రానికి చెందిన వినయ్ కుమార్ (19) స్థానిక పారగాన్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడుగా పని చేస్తూ.. బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తన ఇంటి పైన గల విద్యుత్ తీగలు తాకడంతో కరెంట్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ తో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్మికుడు పనిచేస్తున్న పారగాన్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ తరపున నష్ట పరిహారం అందించాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందించారు.

కురవి మండలంలో ఆర్టీఏ కొరడా బడి పిల్లల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు

ఓవర్లోడ్ ఆటోలు సీజ్.. సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు

సిటిజన్ టైమ్స్ మహబూబాబాద్, నవంబర్ 3

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంతో పాటు పలు మండల వ్యాప్తంగా బడి పిల్లలను తరలించే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, పాఠశాల బస్సులపై రవాణా శాఖ అధికారులు వరుసగా రెండో రోజు తనిఖీలు కొనసాగిస్తున్నారు. కురవి మండల కేంద్రంలో వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు.విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకొని వెళ్తున్న ఆటోలతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆర్సీ, ఎఫ్సీ, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అవసరమైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వాహన యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ఓవర్లోడ్ ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల్లో పాఠశాలలకు పంపించవద్దు అని వాహనంలో పరిమితికి మించి పిల్లలను ఎక్కించకూడదని డ్రైవర్కు సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? వాహనానికి అవసరమైన పత్రాలు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించాలి అని,పిల్లలను సురక్షితంగా పాఠశాలకు పంపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా ఉండాలని,పాఠశాలలకు విద్యార్థులను తీసుకువచ్చే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, ఇతర రవాణా వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు ఉన్నాయో లేదో యాజమాన్యాలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉందో లేదో నిర్ధారించుకోవాలి అని నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలకే విద్యార్థులను తరలించే బాధ్యత అప్పగించాలి. విద్యార్థుల భద్రతను విస్మరించవద్దని



సూచించారు.వర్షాల సమయంలో కరకట్టలు, చెరువు కట్టలు, బురద రహదారులు, జారుడు మార్గాల్లో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించలని,వర్షం కారణంగా టైర్లు జారిపోయే ప్రమాదం ఉంది. వాహనం అదుపు తప్పడం, బ్రేకులు సరిగా పనిచేయకపోవడం వంటి పరిస్థితులు ఎదురుకావచ్చుఅని ముఖ్యంగా బడి పిల్లలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు వేగాన్ని తగ్గించి, రహదారి పరిస్థితులను గమనిస్తూ ప్రయాణించాలి తెలియజేశారు.ఈ ప్రత్యేక తనిఖీల కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు ఎస్. వెంకట్ రెడ్డి, ఖాసీం, సుందర్లాల్ పాల్గొని వాహనాలను తనిఖీ చేస్తూ నిబంధనలపై అవగాహన కల్పించారు.

మచిలీపట్నం మేయర్ పీఠం టీడీపీ కైవసం

32,657 ఓట్ల భారీ మెజారిటీతో అబ్దుల్ అబీదా ఘన విజయం

మచిలీపట్నం, సిటిజన్ టైమ్స్, నవంబర్ 3:

కృష్ణా జిల్లా మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. టీడీపీ మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అబ్దుల్ అబీదా 32,657 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపులో ప్రత్యర్థులపై స్పష్టమైన ఆధిక్యం సాధించి మేయర్గా ఎన్నికయ్యారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల అధికారి అబ్దుల్ అబీదాకు విజయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ విజయంతో టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మచిలీపట్నం నగర రాజకీయాల్లో ఈ ఫలితం కీలక పరిణామంగా నిలిచింది. భారీ మెజారిటీతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్న అబ్దుల్ అబీదాకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.



అమలాపురం మున్సిపల్ పీఠంపై జనసేన జెండా!

చైర్మన్ నల్లా శ్రీధర్ ఘన విజయం

11,979 ఓట్ల భారీ ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థిపై గెలుపు

కూటమి శ్రేణుల్లో వెల్లివిరిసిన సంబరాలు



అమలాపురం, నవంబర్ 02 (సిటిజన్ టైమ్స్):

అమలాపురం మున్సిపాలిటీ రాజకీయాల్లో కీలక ఫలితం వెలువడింది. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. జనసేన పార్టీ అభ్యర్థి నల్లా శ్రీధర్ తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి దూడల వీరితా దేవిపై 11,979 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయదుందుభి మోగించారు. ఈ ఫలితంతో అమలాపురం మున్సిపల్ చైర్మన్ పీఠం జనసేన ఖాతాలో చేరింది.

ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం

ఓట్ల లెక్కింపులో నల్లా శ్రీధర్కు 20,174 ఓట్లు పోలవగా, వైఎస్సార్సీపీ అభ్యర్థి దూడల వీరితా దేవికి 8,195 ఓట్లు మాత్రమే లభించాయి. ఇద్దరి మధ్య 11,979 ఓట్ల భారీ వ్యత్యాసం నమోదైంది. ఫలితాలు వెలువడిన వెంటనే జనసేన శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది.

కూటమి శ్రేణుల్లో పండుగ వాతావరణం

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు అమలాపురంలో సంబరాలు నిర్వహించారు. విజయం సాధించిన వార్డు సభ్యులు తమ తమ వార్డుల్లో ప్రజలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అమలాపురం మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ విజయమే లక్ష్యంగా కూటమి వ్యూహరచన!

అల్లవరం అభ్యర్థుల గెలుపుపై ఎమ్మెల్యే ఆనందరావు దిశానిర్దేశం

గుర్రం గోపాలకృష్ణ కుమార్తో పాటు దేవగుప్తం, బోడసకుర్రు అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి



అల్లవరం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

అల్లవరం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పార్టీ ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి గుర్రం గోపాలకృష్ణ కుమార్తో పాటు దేవగుప్తం, బోడసకుర్రు-1, బోడసకుర్రు-2 ఎంపీటీసీ అభ్యర్థుల విజయావకాశాలపై నాయకులతో చర్చించి ఎన్నికల ప్రచార కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించడం ద్వారా ఓటర్ల మద్దతు కోరాలని నాయకులకు తెలిపారు.

బూత్ స్థాయి నుంచి సమష్టి కార్యాచరణ

ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని పేర్కొంటూ బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి శ్రేణులన్నీ ఐక్యంగా కృషి చేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు భారీ మెజారిటీ సాధించేలా పనిచేయాలని కోరారు. ఈ వ్యూహాత్మక సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండపేటలో కూటమికి ప్రజల పట్టాభిషేకం!

36 వార్డుల్లోనూ విజయంతో చైర్మన్ పీఠం కైవసం

గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే ఫలితాన్ని పునరావృతం చేయాలి

క్లీన్ స్వీప్ బాధ్యత మీది.. సమగ్ర అభివృద్ధి బాధ్యత నాది

పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేట, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్)

మండపేట మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన విజయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మున్సిపల్ చైర్మన్గా వేగుళ్ల అజయ్ కుమార్తో పాటు పట్టణంలోని మొత్తం 36 వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల తీర్పు కూటమి శ్రేణులకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. పట్టణంలో లభించిన మద్దతును స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లోనూ విజయ పరంపర కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

60 ఎంపీటీసీలు, 3 జడ్పీటీసీ స్థానాలే లక్ష్యం

నియోజకవర్గ పరిధిలో పోటీ చేస్తున్న 60 మంది ఎంపీటీసీ అభ్యర్థులు, ముగ్గురు జడ్పీటీసీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గ్రామీణ ప్రాంతాల్లోనూ పునరావృతం చేసేలా ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గ్రామీణ ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు లభిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వేగుళ్ల తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

అభివృద్ధి బాధ్యత నాది.. ఎమ్మెల్యే హామీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో మండపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలు అందించిన విజయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

అల్లవరం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడతాం!

రైతుల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి

విద్యా సంస్థల్లో మౌలిక వసతులు.. శివారు ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం

వైఎస్సార్సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పాటి శ్రీరామ్



అల్లవరం, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

అల్లవరం మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని వైఎస్సార్సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పాటి శ్రీరామ్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరాయని పేర్కొన్నారు. కోడూరుపాడు గుబ్బలవారిపాలెంలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మండల ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

ముంపు సమస్యతో రైతులకు ఏటా నష్టం

మండలంలో గత దశాబ్ద కాలంగా ముంపు సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోందని, ప్రతి ఏడాది వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్య, క్రీడలకు ప్రాధాన్యత

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తూర్పులంక, సామంతకుర్రు ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

శివారు ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం

మండలంలోని శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తానని పాటి శ్రీరామ్ పేర్కొన్నారు. నవంబర్ 5న జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ తిక్కా ప్రసాదు, కుడుపూడి అప్పారావు, బొంతు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతికూల పరిస్థితులను ఎదురించి పోరాడిన వైఎస్సార్సీపీ శ్రేణులకు సలాం!

అధికారం లేకున్నా.. ఒత్తిళ్లు ఎదురైనా వెనుకడుగు వేయని కార్యకర్తలు, నాయకులు

పార్టీ జెండా చేతపట్టి ఎన్నికల బరిలో నిలిచిన ప్రతి ఒక్కరికీ అభినందనలు



పులివెందుల, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్):

అధికారం అండ లేదు.. అధికార బలం లేదు.. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పార్టీ జెండాను వదలకుండా ఎన్నికల బరిలో నిలిచిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కోసం, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో ముందుకు సాగిన ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

అడుగడుగునా సవాళ్లు.. ఎన్నో ఆరోపణలు

ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ పత్రాలు లాక్కోవడం, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, ఎన్నికల బూత్ల వద్ద దాడులు, మహిళా అభ్యర్థులపై దాడులు, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం, రిగ్గింగ్కు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వైఎస్సార్సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేసుల పేరుతో, ప్రాణహాని కలిగిస్తామంటూ బెదిరింపులు ఎదురయ్యాయని కూడా వారు పేర్కొంటున్నారు.

పార్టీ జెండా కోసం వెనుకడుగు వేయని కార్యకర్తలు

ఇన్ని సవాళ్లు ఎదురైనా పార్టీ కోసం ముందుకొచ్చిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల బరిలో తమ పోరాట పటిమను ప్రదర్శించారు. కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలుస్తూ, ప్రజల్లోకి వెళ్లి తమ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

ప్రతి పోరాట యోధుడికీ హృదయపూర్వక అభినందనలు

పార్టీ జెండాను భుజాన వేసుకుని ధైర్యంగా ముందుకు సాగిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, మహిళా నాయకురాలికి ప్రత్యేక అభినందనలు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ కోసం నిలబడిన వారి కృషి గుర్తుంచుకోదగినది. పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్సీపీ శ్రేణులు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలుపుతున్నాయి.

గిద్దలూరు చైర్మన్ పీఠంపై ఉత్కంఠ.. నువ్వా నేనా అన్నట్లుగా కౌంటింగ్!





గిద్దలూరు, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్)

గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆసక్తికరంగా సాగుతోంది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి జాడి వెంకటనారాయణ మూడవ రౌండ్ 184 ఓట్ల మెజారిటీతో ముందంజలో కొనసాగుతున్నారు. ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థితో పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉండటంతో చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది.ఓట్ల లెక్కింపు ప్రతి రౌండ్లోనూ రాజకీయ వర్గాలు, అభ్యర్థుల అనుచరులు ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తుది ఫలితం కోసం గిద్దలూరు పట్టణ ప్రజల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి





పీసీపల్లి, నవంబర్ 03 (సిటిజన్ టైమ్స్)

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పీసీ పల్లి ఎస్సై బి. నరసింహారావు ముందస్తు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా ఎస్సై బి నరసింహారావు మంగళవారం వెలుతుర్ల వారిపాలెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ప్రజలతో, పెద్దలతో సమావేశమై ఎన్నికల ప్రశాంతతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి గొడవలకు, ఘర్షణలకు, అల్లర్లకు తావు ఇవ్వవద్దని, గ్రామ ఐక్యతను కాపాడాలని కోరారు.ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించినా, ఓటర్లను బెదిరించినా, మద్యం, డబ్బులు పంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని సూచించారు.

అంతర్జాతీయ వేడుకల్లో ఇండియన్ హారర్ మేజిక్!

ప్రపంచవ్యాప్తంగా హలోవీన్ వేడుకల జోరు మొదలైన నేపథ్యంలో థ్రిల్ పంచే భయానక చిత్రాలను ఇష్టపడే సినీ ప్రియుల కోసం కొన్ని ప్రత్యేకమైన సినిమాలు క్యూ కట్టాయి. సాధారణంగా హలోవీన్ అనగానే విదేశీ దెయ్యాల కథలు గుర్తుకు వస్తాయి. కానీ ఈసారి భారతీయ క్లాసిక్స్ నుంచి హాలీవుడ్ భయానక చిత్రాల వరకు అన్నీ కలిపి పర్ఫెక్ట్ వాచ్‌లిస్ట్ సిద్ధమైంది. భయంతో వెన్నులో వణుకు పుట్టించే అగ్రశ్రేణి చిత్రాల విశేషాలు ఏంటో చూద్దాం.





ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సింది తెలుగు, హిందీ ప్రేక్షకులను ఆకట్టుకున్న -తుంబాడ్-. దురాశ నేపథ్యంలో సాగే పీరియాడిక్ హారర్ డ్రామా ప్రేక్షకులను ఓ సరికొత్త భయానక ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. అలాగే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన -భూత్-చిత్రం గురించి చెప్పాల్సిన పని లేదు. అజయ్ దేవగన్, ఊర్మిళ జంటగా నటించిన ఈ సైకలాజికల్ హారర్ సినిమా విడుదలైన రోజుల్లో సంచలనం సృష్టించింది.కామెడీతో పాటు భయన్ని పంచే ప్రియదర్శన్ చిత్రం -బూల్ బులయ్యా- ఎప్పటికీ ఎవ్వర్ గ్రీనే. అక్షయ్ కుమార్, విద్యాబాలన్ అద్భుత నటనతో చిత్రం క్లైమాక్స్ ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది. అలాగే బిపాసా బసు నటించిన -రాజ్- బాలీవుడ్‌లో హారర్ జోనర్‌కు సరికొత్త ఊపు తెచ్చింది. ఊటీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమకథాత్మక భయానక చిత్రం నాటి యువతను విపరీతంగా ఆకట్టుకుంది. వీటితో పాటు టెలివిజన్ వేదికగా భయపెట్టే డిఫరెంట్ కాన్సెప్ట్ చిత్రం -13దీ- కూడా ఈ జాబితాలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. మాధవన్ హీరోగా నటించిన ఈ చిత్రంలో టీవీలో వచ్చే సీరియల్ నిజ జీవితంలో జరగడం అనే యూనిక్ పాయింట్ ప్రేక్షకులను కట్టపడేస్తుంది.హాలీవుడ్ నుంచి -ది కంజురింగ్- , -హెరిడిటరీ- వంటి సినిమాలు నిజమైన దెయ్యాల అన్వేషణ, ప్రయోగాల ఆధారంగా భయానక అనుభూతిని ఇస్తాయి. ఇటీవలి కాలంలో వచ్చిన అజయ్ దేవగన్ -శైతాన్-, మమ్ముట్టి నటించిన బ్లాక్ అండ్ వైట్ పీరియడ్ హారర్ డ్రామా -భ్రమయుగం- సినిమాలు కూడా ఈ జాబితాలో చేరి ప్రేక్షకులను అబ్బురపరుస్తున్నాయి. మూఢనమ్మకాలు, చేతబడులు, పురాణాల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాలు హలోవీన్ రాత్రిని మరింత ఉత్కంఠభరితంగా మారుస్తున్నాయి. విదేశీ చిత్రాలకే పరిమితం కాకుండా మన దేశీయ సంస్కృతి, పురాణాలు .. అతీంద్రియ శక్తుల ఆధారంగా తెరకెక్కిన అద్భుతమైన 10 హారర్ సినిమాలను హలోవీన్ రాత్రిలో వీక్షించడం ద్వారా సరికొత్త థ్రిల్‌ను ఆస్వాదించవచ్చు. ప్రేమికులకు ఈ చిత్రాలు మంచి అనుభూతిని ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడం మిస్టరీ.. టీమ్ మేనేజ్‌మెంట్‌పై మాజీ స్పిన్నర్ అసంతృప్తి

- కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడంపై మణీందర్ సింగ్ అసంతృప్తి
- అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని వ్యాఖ్య
- జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని వ్యాఖ్య
- గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా అప్పటి కెప్టెన్లు సరైన అవకాశాలివ్వలేదని ఆరోపణ
- న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరం



భారత స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు జట్టులో క్రమం తప్పకుండా అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ స్పిన్నర్ మణీందర్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతడికి తగినన్ని అవకాశాలు ఎందుకు రావడం లేదో తనకు ఇప్పటికీ మిస్టరీగానే ఉందన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని, అతడి బౌలింగ్‌లో వైవిధ్యం ఉందని పేర్కొన్నాడు. జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని, అందుకే తరచూ పక్కన పెడుతున్నారని మణీందర్ అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టీ20 సిరీస్‌లో భారత్ 3-2తో గెలిచినా కుల్‌దీప్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం దక్కలేదు. 124 వన్డేల్లో 201 వికెట్లు తీసిన అతడు.. ప్రస్తుతం భారత జట్టులో ఉన్న బౌలర్లందరి కంటే ఎక్కువ వికెట్లు సాధించాడు.గతంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కుల్‌దీప్‌కు ఐదు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఇచ్చి ఉంటే భారత్ 3-1తో గెలిచేదని తాను భావించానని మణీందర్ చెప్పాడు. అతడిపై తనకు అంతటి నమ్మకం ఉందన్నాడు. గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా.. కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ అతడిపై తగినంత విశ్వాసం చూపలేదని గుర్తుచేశాడు. ఇప్పుడు కుల్‌దీప్ విషయంలోనూ అలాంటి పరిస్థితే కనిపిస్తోందని వ్యాఖ్యానించాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎడమచేతి మణికట్టు స్పిన్నర్లు అరుదుగా ఉంటారని, అలాంటి బౌలర్‌కు నిరంతరం అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఏడాది భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్.. కుల్‌దీప్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు మ్యాచ్‌ల్లో కుల్‌దీప్ మూడు వికెట్లే తీశాడు. అయితే న్యూజిలాండ్ పిచ్‌లపై బౌలర్లకు కొంత సహకారం లభించే అవకాశం ఉండటంతో కుల్‌దీప్ తన సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు ఇది మంచి అవకాశమని భావిస్తున్నారు.

భారత్ ఙం న్యూజిలాండ్ తొలి వన్డే.. పిచ్ రిపోర్ట్, నేడు వెదర్ రిపోర్ట్ ఇదే!



టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకుని జోరుమీదున్న టీమిండియా, ఇప్పుడు అసలు సిసలైన వన్డే పోరుకు సమాయత్తమైంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా (2026, నవంబర్ 4, బుధవారం) తొలి వన్డే జరగనుంది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ ఇండియన్ టీమ్ కు సారథ్యం వహిస్తుండగా, కివీస్ జట్టును మిచెల్ శాంట్నర్ నడిపించనున్నాడు. అయితే తొలి మ్యాచ్‌పై వర్షం ప్రభావం ఎంత వరకు ఉంది? పిచ్ ఎలా ఉండబోతోంది? అన్న అంశాలనింటిని ఇప్పుడు తెలుసుకుందాం..

ఆక్లాండ్‌లో వర్షం.. మ్యాచ్ జరుగుతుందా?:

క్రికెట్ ప్రేమికులకు కాస్త ఊరటనిచ్చే ముచ్చట ఏంటంటే.. ఈ మ్యాచ్‌కు వాతావరణం దాదాపు అనుకూలించే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఆక్యూ వెదర్ నివేదిక ప్రకారం ఆక్లాండ్‌లో ఉదయం పూట వర్షం కురిసే అవకాశం 56 శాతంగా ఉంది. ఇక స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు) మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆ సమయానికి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం తగ్గుముఖం పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాబట్టి మ్యాచ్‌కు పెద్దగా అంతరాయం కలగకపోవచ్చు.. ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కానున్నాయి.

పిచ్ రిపోర్ట్:

ఈడెన్ పార్క్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇరు జట్లు ఇక్కడ భారీగా పరుగులు చేసే ఛాన్స్ ఉంది.

చిన్న బౌండరీలు: ఈ మైదానంలో బౌండరీలు చాలా చిన్నవి కావడంతో బ్యాటర్లు సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

స్వింగ్ ఎఫెక్ట్: కొత్త బంతితో మొదటి కొన్ని ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు కొంచెం స్వింగ్ లభించినప్పటికీ, ఓవరాల్‌గా ఇది హై-స్కోరింగ్ మ్యాచ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

హిస్టారికల్ రికార్డ్: 2026, సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన నాలుగో టీ20 మ్యాచులో ఇదే ఈడెన్ పార్క్ మైదానంలో న్యూజిలాండ్ టీమిండియాపై భారీ విజయం సాధించింది. అప్పట్లో కివీస్ 259/7 స్కోరు చేయగా, భారత్‌ను 172 పరుగులకే ఆలౌట్ చేసి 87 పరుగుల తేడాతో గెలుపొందింది. మరీ చూడాలి ఆ మ్యాచ్ కి ప్రతీకారం తీర్చుకుంటుందో లేదో.

సొంత ఖర్చుతోనే సింధు, లక్ష్యసేన్ విజయాలు.. భారత షట్లర్లకు నిధుల కష్టాలు!

- యూరప్ పర్యటనకు నిధులు విడుదల చేయని సాయ్
- ఆటగాళ్లే ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులు భరించిన వైనం
- కొందరు ఆటగాళ్లు కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్న దుస్థితి
- గడువులోగా ప్రతిపాదన ఇవ్వలేదని సాయ్ వివరణ
- ఆసియా క్రీడల ఫలితాల వల్లే నిధులు ఆగాయన్న వాదనను ఖండించిన సాయ్



భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ యూరప్ పర్యటనలో టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. అయితే ఆ టోర్నీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చుల విషయంలో వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీల్లో జరిగిన నాలుగు టోర్నీలకు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) నిధులు విడుదల చేయలేదని సమాచారం. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్'ను ఉటంకిస్తూ 'ఇండియా టుడే' కథనం ప్రకారం.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సి వచ్చింది. నిధులు అందకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సింధు.. కొంత ఖర్చును తానే భరించానని, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సంస్థ కూడా సాయం చేసిందని తెలిపింది.నిధుల కొరత ప్రభావం ఆటగాళ్ల సహాయక సిబ్బందిపైనా పడింది. కోచ్‌ల ఖర్చులు భరించలేక కొందరు వారిని వెంట తీసుకెళ్లలేకపోయారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అమ్మితా చాలిహా, డెన్మార్క్ ఓపెన్‌లో తన్వీ శర్మ కోచ్ సహాయం లేకుండానే పోటీపడ్డారు. నిధులు నిలిచిపోవడానికి కారణంపై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రదర్శన దీనికి కారణమై ఉండొచ్చని కొందరు అనుమానించినా.. ఆ వాదనను సాయ్ అధికారి ఖండించారు. టోర్నీలకు 30 రోజుల ముందుగా సమర్పించాల్సిన ప్రతిపాదనను బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ) గడువులోగా ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. నిధుల ఇబ్బందుల నేపథ్యంలోనూ భారత ఆటగాళ్లు మంచి ఫలితాలు సాధించారు. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలవగా, సింధు మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో టైటిల్. మరోవైపు, రాబోయే టోర్నీలకు నిధుల సాయం పునరుద్ధరిస్తామని సాయ్ తెలిపినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే యూరప్ పర్యటనలో ఆటగాళ్లు స్వయంగా పెట్టుకున్న ఖర్చులను తిరిగి చెల్లించబోమని స్పష్టం చేసినట్లు తెలిపింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776